40 లీటర్ల నాటుసారా స్వాధీనం

పర్ణశాల, ఏప్రిల్ 19: మండలంలోని సీతానగరం వద్ద హెడ్ కానిస్టేబుల్ కృష్ణయ్య సిబ్బందితో శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తుల వద్ద నుంచి 40 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. సుజ్ఞానపురం గ్రామానికి చెందిన అజ్మీరా నాగేశ్వరరావు, అజ్మీరా శ్రీకాంత్ ఛత్తీస్‌గఢ్ నుంచి సారా కొనుగోలు చేసి చుట్టుపక్కల గ్రామాల్లో విక్రయించేందుకు తీసుకొస్తున్నట్లు తెలిపారు. వారి వద్ద ఉన్న 40 లీటర్ల నాటుసారా, బైక్‌ను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి కేసు నమోదు చేశామని ఎస్సై గణేశ్ తెలిపారు.

మొక్కజొన్న చేను దగ్ధం

గుండాల, ఏప్రిల్ 19 : చేతికందిన 25 ఎకరాల మొక్కజొన్న పంట దగ్ధమైన సంఘటన గుండాల మండల పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత సమయంలో ప్రమాదం సంభవించగా చేన్లు మొత్తం అగ్నికి ఆహుతి అయ్యాయి. పోతిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన రైతులు పూకె చిన్న పగడయ్య, జోగ సారయ్య, జోగ రవీందర్, పెండెకట్ల పెంటయ్య, పూకె నర్సయ్య, సూనెం మోహన్‌రావు, ఈసం పాపమ్మతోపాటు మొత్తం తొమ్మిది మంది రైతుల చేన్లు అగ్నికి దగ్ధమయ్యాయి. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. సుమారు ఆరు లక్షల మేర పంట నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు.

భద్రుతండాలో..

ఇల్లెందు రూరల్, ఏప్రిల్ 19 : షార్ట్‌సర్క్యూట్‌తో మొక్కజొన్న పంట దగ్ధమైన ఘటన మండలంలో చోటుచేసుకున్నది. శుక్రవారం మండలంలోని పోలారం పంచాయతీ భద్రుతండాకు చెందిన బాదావత్ మల్లు, తేజ, హెమ్లు, వాంకుడోత్ శంకర్ మరికొంత మంది రైతులు సుమారు 20ఎకరాల మొక్కజొన్న పంట వేశారు. పంట కోసి కుప్ప పోసి ఉండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో పంట పూర్తిగా దగ్ధమైందన్నారు. అంతేకాక విద్యుత్ మోటార్లు పూర్తిగా కాలిపోయాయి.

ఎంపీటీసీని హత్య చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

భద్రాచలం, ఏప్రిల్ 19: మండలంలోని కన్నాయిగూడెం ఎంపీటీసీ వరస బాలకృష్ణ ని గురువారం అర్ధరాత్రి హత్య చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ భద్రాచలం కమిటీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం భద్రాచలంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా అక్రమాలు చేసి దండుకునే వారిని ప్రశ్నించిన ఆదివాసీ నాయకులపై హత్యకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అతి చిన్న వయస్సులోనే ఎంపీటీసీగా ఎన్నికై యువకులకు ఎంతో ఆదర్శంగా నిలిచారని, అతని ఎదుగుదలను ఓర్వలేకనే సమీప రాజకీయ ప్రత్యర్థులు హత్య చేశారన్నారు.

భద్రతా ఏర్పాట్ల పరిశీలన

పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న సీఐ, ఎస్సైలు

అశ్వారావుపేట, ఏప్రిల్ 19 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను పోలీసు అధికారులు పరిశీలించారు. పట్టణంలోని ఎమ్మార్సీ, ఐకేపీ, మేజర్ గ్రామ పంచాయతీ, పేరాయిగూడెం, రామన్నగూడెం, పండువారిగూడెం పోలింగ్ కేంద్రాలను సందర్శించిన సీఐ, ఎస్సై.. ఆయా కేంద్రాల్లో మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. వారి వెంట గిర్దావర్ కృష్ణ, ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వర్‌రెడ్డి, బీఎల్‌వోలు ఉన్నారు.

మద్యం మత్తులో కారు డ్రైవర్ హల్‌చల్

సత్తుపల్లి టౌన్, ఏప్రిల్ 19: మద్యం మత్తులో కారును అతివేగంగా నడిపి ఓ వ్యక్తి హల్‌చల్ సృష్టించిన ఘటన శుక్రవారం పట్టణంలో చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బుగ్గపాడు గ్రామానికి చెందిన యాచమనేని సత్యనారాయణ అనే వ్యక్తి మద్యం మత్తులో కారు నడుపుతూ పాతసెంటర్‌లో ఎదురుగా వస్తున్న బైక్, ట్రాలీ ఆటోతో పాటు అక్కడే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న మహిళలకు గాయాలు కావడంతో వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సత్యనారాయణను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

భవన నిర్మాణ కార్మికుడు మృతి

మామిళ్లగూడెం, ఏప్రిల్ 19: ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ భవన నిర్మాణ కార్మికుడు మృతిచెందిన సంఘటన ఖమ్మం ఎన్‌టీఆర్ సర్కిల్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. ఖమ్మం టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మంరూరల్ మండలం ఎం.వెంకటాయపాలెం గ్రామానికి చెందిన మెట్టు రాములు(51) భవన నిర్మాణ కార్మికుడు. తన బంధువు సంపత్‌తో కలిసి అతడి ద్విచక్రవాహనంపై ఖమ్మం టేకులపల్లి వద్ద పని ప్రదేశానికి వస్తున్నాడు. ఎన్‌టీఆర్ సర్కిల్ వద్ద రెడ్ సిగ్నల్ పడడంతో ఆగారు. తరువాత గ్రీన్‌సిగ్నల్ రావడంతో బయలుదేరారు. అయితే వీరి ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో రాములు కిందపడిపోయాడు. అతడి పైనుంచి లారీ టైరు వెళ్లడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. సంపత్ ఈ ప్రమాదం నుంచి బయటపడ్డాడు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
Classifieds

WANTED
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K Ph: 9640258899/9640468899
NT-311829

INDUSIND BANK LTD.
LIGHT COMMERCIAL VEHICLE FOR SALE
1).TATA ACE MEGA BS IV MODEL 2016, TS26T 1384. 2). MAHINDRA JEETOPLUS BS IV, MODEL 2019, TS04UD 0708. 3). APE XTRA LDX+HD BS VI, MODEL 2022, TS04UE 2029. 4). APE AUTO DX BS6, MODEL 2021, TS04UD 7607
Cell:9959401146
PolasJuice Point Lane, ZP Centre
Beside Sidhardha Hospitals,Khammam.

అతి తక్కువ ఖర్చు
అత్యధిక ప్రచారం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన కలిగి ఉండాలి

జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో కేటీపీఎస్ 5, 6 దశల సీఈ ప్రభాకర్‌రావు

అగ్నిమాపక వారోత్సవాల్లో పాల్గొన్న సీఈ, ఇంజినీర్లు

పాల్వంచ, ఏప్రిల్ 19: ప్రస్తుత వేసవిలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటం వల్ల అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని కేటీపీఎస్ 5, 6 దశల సీఈ ఎం.ప్రభాకర్‌రావు అన్నారు. అందుకని అగ్ని ప్రమాదాల పట్ల కార్మికులు, ఇంజినీర్లు అప్రమత్తంగా ఉంటూ వాటి నివారణపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. స్థానిక పాల్వంచ కేటీపీఎస్ 5, 6 దశల కర్మాగారంలో ఈ నెల 14న ప్రారంభమైన అగ్నిమాపక వారోత్సవాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సేఫ్టీ డివిజన్ – కేటీపీఎస్ 5, 6 దశల డీఈ (సేఫ్టీ) సమ్మయ్య పర్యవేక్షణలో నిర్వహించిన ఫైర్ డ్రిల్‌ను ఫైర్ ఆఫీసర్ యెడ్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో వివరించారు. అగ్ని ప్రమాదాల నివారణ పరికరాల పనితీరు, ప్రమాదం జరిగినప్పుడు స్పందించే తీరు గురించి కార్మికులు, ఇంజనీర్లకు టీం లీడింగ్ ఫైర్‌మెన్‌లు, ఫైర్ టెండర్ డ్రైవర్లు, ఫైర్‌మెన్‌లు అవగాహన కల్పించారు. వివిధ విభాగాల అధికారులు వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, జీవీ ధర్మారావు, పీ.కృష్ణ, మోక్షవీర్, రమేశ్, జార్జి, శేషసాయి, బాగం రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు సహకరించండి

ఆర్డీవో దామోదరరావు

మాట్లాడుతున్న భద్రాచలం ఆర్డీవో దామోదరరావు

భద్రాచలం, ఏప్రిల్ 19: అసెంబ్లీ ఎన్నికలకు ఎలా సహకరించారో పార్లమెంట్ ఎన్నికలకు కూడా అలానే సహకరించాలని భద్రాచలం ఆర్డీవో, ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి దామోదరరావు రాజకీయ ప్రజాప్రతినిధులకు సూచించారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలోని తన ఛాంబర్‌లో వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైందని, అభ్యర్థి నామినేషన్ వేయడానికి వెళ్లినప్పుడు ఎటువంటి గొడవలు చేయకుండా ప్రశాంత వాతావరణంలో అధికారులకు సహకరించి నామినేషన్ వేయాలన్నారు. ఓటర్లకు ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. శనివారం కొత్తగూడెం స్ట్రాంగ్ రూమ్‌నుంచి ఈవీఎంలు వస్తాయని వాటిని భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భద్రపరుస్తున్నామని ప్రజాప్రతినిధులు డిగ్రీ కళాశాలకు రావాలని కోరారు. సమావేశంలో అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్ మణిధర్, వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు త్వరగా చేపట్టాలి

ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి

పాల్వంచ, ఏప్రిల్ 19: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. మండలంలోని 49 అమ్మ ఆదర్శ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఐకేపీ, వీవోలు, అసిస్టెంట్ ఇంజినీర్లతో పాల్వంచ బొల్లోరిగూడెం ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. ఇందులో ప్రధానంగా ఆయా పాఠశాలల్లో తరగతి గదుల మైనర్, మేజర్ మరమ్మతులు, విద్యుత్ సదుపాయం, విద్యార్థులకు తాగునీటి వసతి, టాయిలెట్ల సౌకర్యం వంటివి కల్పించడానికి నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. మంజూరైన నిధులను ఆయా పాఠశాలల పరిధిలో ఐకేపీకి చెందిన వీవోలు, హెచ్‌ఎంలు, గ్రామస్తుల సహకారంతో పాఠశాలలను చక్కగా తీర్చిదిద్దుకోవాలని అన్నారు. ఎంఈవో శ్రీరామ్మూర్తి, ఏపీఎం రాంబాబు, అమ్మ ఆదర్శ పాఠశాల ఏఈలు సరస్వతి, యశస్విని, ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.

గౌతంఖనిలో సాయమ్మతల్లికి బోనాలు

బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

రామవరం, ఏప్రిల్ 19: 'విపత్కర పరిస్థితులు, ఆపదల నుంచి తమను చల్లంగా చూడు తల్లీ..' అంటూ భక్తులు వేడుకున్నారు. ఈ మేరకు సింగరేణి కొత్తగూడెం ఏరియా గౌతంఖని ఓపెన్ కాస్ట్ సమీప గుట్టలో కొలువై ఉన్న గుండాల సాయమ్మ తల్లికి స్థానికులు శుక్రవారం రాత్రి చుక్క బోనాలను సమర్పించారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ బోనాల కార్యక్రమంలో ఆలయ పూజారి రవికుమార్ ఇంటి నుంచి గుడి వరకు అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొచ్చారు. బోనాలు, డప్పు వాయిద్యాలు, శివసత్తుల పూనకాలతో అమ్మవారికి బోనాన్ని నైవేద్యంగా సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న గుడి వరకు పాదయాత్రగా వెళ్లారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 19 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులను కల్పించాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం మండలంలోని తొట్టిపంపులో పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. అధికారులకు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యుత్, మంచినీటి సదుపాయాలు కల్పించాలని, ఓటర్లకు ఇబ్బందులు లేకుండ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్, ఆర్ఐ మధు, బీఎల్వోలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నివాళులర్పిస్తున్న రేగా కాంతారావు

సారపాక, ఏప్రిల్ 19 : సారపాకకు చెందిన ఉప్పెర్ల అన్నారావు కుమారుడు ఉప్పెర్ల శ్రీనివాస్‌ప్రవీణ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు శుక్రవారం ఆయన నివాసానికి వెళ్లి శ్రీనివాస్‌ప్రవీణ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొనకంచి శ్రీనివాసరావు, బెజ్జంకి కనకాచారి, చుక్కపల్లి బాలాజీ, ఎస్సీ సెల్ పట్టణ కార్యదర్శి పంగి సురేశ్ ఉన్నారు.

ఉపాధిహామీ పథకాన్ని తొలగించేందుకు మోదీ ప్రభుత్వం కుట్ర

టేకులపల్లి, ఏప్రిల్ 19 : దేశంలో మోడీ ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సరైన బడ్జెట్ కేటాయించకుండా తొలగించాలని చూస్తున్నదని అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు జి.రామచంద్రు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి కల్తీ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండలంలో ముత్యాలంపాడులో జోగ నాగరాజు అధ్యక్షతన జరిగిన గ్రూప్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని కొలతలతో సంబంధం లేకుండా రోజు వారీ కూలీ చెల్లించాలని, మేట్లకు నెల నెల వేతనం ఇవ్వాలని, ఫీల్డ్ అసిస్టెంట్‌లను, ఏపీవోలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో వట్టం రమేశ్, జోగ పాపయ్య, గడ్డం సారయ్య పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో ఆదివాసీలు సత్తాచాటాలి

టేకులపల్లి, ఏప్రిల్ 19 : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఆదివాసీలు సత్తాచాటాలని మహబుబాబాద్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మైపతి అరుణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆదివాసీ తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు సనప కోటేశ్వరరావు ఆధ్వర్యంలో అభ్యర్థి గెలుపునకు ప్రచార నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థి అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. ఎంపీ ఎన్నికల్లో ఎస్టీలకు టికెట్ కేటాయించి ఆదివాసీలను విస్మరిస్తున్నాయని, ఈ ఎన్నికల్లో ఆదివాసీలంతా ఏకమై సత్తాచాటాలని కోరారు. కార్యక్రమంలో చింత సంపత్, కుర్సం నాగేశ్వరరావు, జబ్బా రామకృష్ణ, స్థానిక కిష్టారం ఎంపీటీసీ పూన్నెం స్వప్న, ఉపసర్పంచ్ పూన్నెం నరసింహారావు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుజాత

అశ్వాపురం, ఏప్రిల్ 19 : వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఎంపీపీ ముత్తినేని సుజాత అధికారులను కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో వేసవికాలంలో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పలు శాఖల ప్రగతి నివేదికలపైన చర్చ జరిపారు. ఎంపీడీవో వరప్రసాద్, వ్యవసాయ అధికారి సాయిశాంతన్‌కుమార్, ఎండీ షరీఫ్, ఎస్‌కే ఖదీర్, ఎంపీటీసీలు, పలుశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

ప్రణవ్‌శర్మకు సత్కారం

ప్రణవ్‌శర్మను సత్కరిస్తున్న శంకర్‌రెడ్డి

సారపాక, ఏప్రిల్ 19 : సారపాకలో ఐటీసీ పీఎస్‌పీడీ కర్మాగారంలో యూనిట్ హెడ్ ప్రణవ్‌శర్మను రోటరీ ఇంటర్నేషనల్ గవర్నర్ డాక్టర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దుశ్శాలువాతో సత్కరించి సీతారాముల జ్ఞాపికను అందజేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రణవ్‌శర్మ నేతృత్వంలో కర్మాగారం మరింత అభివృద్ధి చెందాలని, స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆకాంక్షించారు.

ఈద్గా నిర్మాణానికి శంకుస్థాపన

అశ్వాపురం, ఏప్రిల్ 19 : రామచంద్రాపురం గ్రామంలో ఉన్న ఈద్గా నిర్మాణం కోసం శుక్రవారం ముస్లిం మతపెద్దలు శంకుస్థాపన చేశారు. రామచంద్రాపురం గ్రామపెద్దలు, మాజీ సర్పంచ్ కాకా అశోక్ పాల్గొని తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఎస్కే ఖదీర్, షేక్ ఖాజా, రఫీ, జావీద్, నాగుల్‌మీరా, సాధిక్ అన్సారీ పాల్గొన్నారు.

శ్రీనివాసగిరి ఆలయంలో ప్రత్యేక పూజలు

పాల్వంచ, ఏప్రిల్ 19: పట్టణంలోని శ్రీనివాసగిరికొండపై ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారి కల్యాణం జరిగిన 16 రోజులకు జరిగే పండుగ సందర్భంగా గుట్ట కింద శుక్రవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. శ్రీనివాసగిరికొండ కింద ఉన్న శ్రీవారి పాదల మంటపం వద్ద దేవాలయ అర్చకులు తోలేటి నగేశ్ శర్మ, ఆరుట్ల ఫణిరాజా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా 3 వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. దేవాలయ ఉత్సవాల నిర్వాహకులు ఆరుట్ల లక్ష్మణ్, కందుకూరి రాము, ఊకే భద్రయ్య, మేదరమెట్ల శ్రీనివాస్, సువ్వారపు వెంకటేశ్వరరావు, గండు భరత్ పాల్గొన్నారు.

సివిల్స్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రామవరం, ఏప్రిల్ 19: 2025లో జరగనున్న సివిల్స్ పరీక్షలకు హజరయ్యే మైనార్టీ, ఎస్సీ,ఎస్టీ, మహిళా అభ్యర్థులకు న్యూఢిల్లీ జామియా మిల్లియా సెంట్రల్ యూనివర్సిటీ అందిస్తున్న ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ యాకూబ్‌పాషా శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ ఉచిత శిక్షణ పొందేందుకు ఈ ఏడాది జూన్ 29న హైదరాబాద్‌లో సరదు యూనివర్సిటీ నిర్వహించే ప్రవేశ పరీక్షలో మెరిట్ సాధించాల్సి ఉంటుందని అన్నారు. ఆసక్తిగల న్న అభ్యర్థులు తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాల కోసం 8520860785 నంబరును సంప్రదించాలని సూచించారు.

డీఎంహెచ్‌వోపై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు

కొత్తగూడెం అర్బన్, ఏప్రిల్ 19: ఎన్నికల కోడ్ ఉల్లంఘించేలా వ్యవహరించిన డీఎంహెచ్‌వోపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కొత్తగూడెం అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఏఆర్‌వో)కి లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ రాజేశ్‌నాయక్ శుక్రవారం రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీ పబ్లిక్ అండ్ మెడికల్ ఉద్యోగుల జాతీయ అధ్యక్షుడు, కాంగ్రెస్ మాజీ రాజ్యసభ సభ్యుడు సంజీవరెడ్డి ఫొటోతో ఉన్న డైరీని ఈ నెల 15న డీఎంహెచ్‌వో శిరీష ఆవిష్కరించారని, ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుందని అన్నారు. ఈ అంశంపై విచారణ జరిపి ఆ డైరీ ఆవిష్కరణలో పాల్గొన్న డీఎంహెచ్‌వోతోపాటు ఉద్యోగులపైనా చర్యలు తీసుకోవాలని కోరారు.

అధికారులకు సత్కారం

దేవస్థానం ఈవో, ఈఈ, సీసీలను సత్కరిస్తున్న దేవాదాయ కమిషనర్ హనుమంతరావు

భద్రాచలం, ఏప్రిల్ 19 : భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీరామ నవమి తిరు కల్యాణ బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన దేవస్థానం ఈవో ఎల్ రమాదేవిని, ఈఈ రవీందర్‌రాజును, సీసీ శ్రీనివాసరెడ్డి వివిధ విభాగాల అధికారులను సమాచారశాఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు శుక్రవారం సత్కరించారు.

వృద్ధురాలి దారుణ హత్య

పోలీసుల అదుపులో ఉన్న సాదం రామకృష్ణ

వైరారూరల్, ఏప్రిల్ 19: భార్యపై అనుమానం పెనుభూతమైంది. ఆ అనుమానమే గత సంవత్సరం సొంత తమ్ముడిని, ఇప్పుడు భార్య అమ్మమ్మను బలి తీసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రెబ్బవరం గ్రామానికి చెందిన సాధం రామకృష్ణకు ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా కొత్తపేట మండలం గంటి గ్రామానికి చెందిన నాగదేవితో 9 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. భార్యపై అనుమానంతో గతంలో సొంత తమ్ముడు నరేశ్‌ను అతి దారుణంగా హత్య చేశాడు. ఈ కేసులో జైలుకెళ్లిన రామకృష్ణ ఇటీవల విడుదయ్యాడు. భార్యను కాపురానికి పంపించాలని భార్య అమ్మమ్మ అయిన గంటాలమ్మను అడగ్గా పంపించబోమని చెప్పింది. భార్యను పంపించలేదనే కారణంతో కక్ష పెంచుకున్న రామకృష్ణ బుధవారం తెల్లవారుజామున గంటాలమ్మ ఇంటికి వెళ్లాడు. హాల్లో నిద్రిస్తున్న గంటాలమ్మను కత్తితో విచక్షణారహితంగా నరకడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. నాగదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్‌లోని కొత్తపేట ఎస్సై అశోక్ తెలిపారు. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న కొత్తపేట పోలీసులు నిందితుడి ఆచూకి కోసం వైరా పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వైరా పోలీసులు రెబ్బవరం గ్రామంలోని తన నివాసంలో రామకృష్ణను అందుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. నిందితున్ని కొత్తపేట పోలీసులకు అప్పగించనున్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

మణుగూరుటౌన్, ఏప్రిల్ 19 : సింగరేణి సంస్థ మణుగూరు ఏరియాకు చెందిన సింగరేణీయులు, మాజీ సింగరేణి ఉద్యోగుల కుటుంబాల నిరుద్యోగ యువత, ప్రాజెక్టు ప్రభావిత పునరావాస, పరిసర గ్రామాల యువతకు సింగరేణి ఆధ్వర్యంలో అందిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 30 వరకు గడువును పొడిగించినట్లు ఏరియా జీఎం దుర్గం రామచందర్ శుక్రవారం తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేసవి క్రీడా శిబిరాల్లో శిక్షకుల నియామకానికి దరఖాస్తులు

కొత్తగూడెం టౌన్, ఏప్రిల్ 19: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (ఎస్‌ఏటీఎస్) సహకారంతో జిల్లా యువజన, క్రీడల కార్యాలయం ఆధ్వర్యంలో మే 1 నుంచి 31 వరకు జిల్లాలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించేందుకు సీనియర్ క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి పరంధామరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాచ్యూరం పొందిన క్రీడల్లో 14 ఏళ్లలోపు బాలబాలికలకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని అన్నారు. స్థానికంగా ఉండి శిబిరాలు నిర్వహించే వారు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 24 సాయంత్రం 4 గంటల్లోగా కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని, మరింత సమాచారం కోసం 9849913068 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

విగ్రహాల ప్రతిష్ఠ

మణుగూరుటౌన్, ఏప్రిల్ 19 : మండల కేంద్రంలోని కట్టుమల్లారం గ్రామంలో ముత్యాలమ్మ, పోతురాజు విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. దానధర్మ ట్రస్ట్ చైర్మన్ గంటా రాధా ఆధ్వర్యంలో పూజారుల వేదమంత్రాల నడుమ విగ్రహాలు ప్రతిష్ఠించారు. ఆర్థికసాయం అందించిన ట్రస్ట్ సభ్యులు, పూజారులు, గ్రామపెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

పర్ణశాల, ఏప్రిల్ 19: పర్ణశాల దివ్యక్షేత్రంలో చతుర్భుజ మహాలక్ష్మి అమ్మవారి విగ్రహాన్ని శుక్రవారం అర్చకులు ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం 8:16 గంటలకు వృషభ లగ్న పుష్కరాంశంలో విగ్రహ ప్రతిష్ఠ మహా కుంభ సంప్రోక్షణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రత్యేకాధికారి అనీల్‌కుమార్, అర్చకులు పొడిచేటి రామభద్ర ఆచార్యులు, సీతారామానుజాచార్యులు, వెంకటాచార్యులు, భరద్వాజ ఆచార్యులు, నర్సింహాచార్యులు పాల్గొన్నారు.

పూసం మల్లయ్యకు నివాళి

టేకులపల్లి, ఏప్రిల్ 19 :సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ నాయకుడు పూసం మల్లయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న నాయకులు మల్లయ్య భౌతికకాయంపై ఎర్రజెండా కప్పి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో రుక్కమ్మ, ఈసం లాలయ్య, లక్ష్మయ్య, మోకాళ్ల లక్ష్మయ్య, పోలెబోయిన వసంతరావు, కృష్ణ ఉన్నారు.

బోరు ఏర్పాటు

పర్ణశాల, ఏప్రిల్ 19: మండలంలోని వలస గొట్టికోయ గిరిజన గ్రామం మానుగుట్టలో దుమ్ముగూడెం సీఐ అశోక్ ఆధ్వర్యంలో తాగునీటి అవసరాల నిమిత్తం శుక్రవారం బోరు ఏర్పాటు చేశారు. గతంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో వలస గొత్తికోయ గిరిజన గ్రామాలకు పలు సామాజిక కార్యక్రమాలు చేపట్టి అన్నిరకాలుగా సహాయం చేశారు. కార్యక్రమంలో ఎస్సై గణేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ ఏర్పాటు



ఇల్లెందు రూరల్, ఏప్రిల్ 19 : ఎంపీడీవో ధన్‌సింగ్ అధ్వర్యంలో ప్రయాణికుల కోసం బస్‌షెల్టర్ ఏర్పాటు చేశారు. శుక్రవారం మండలంలోని సుభాష్‌నగర్ పంచాయతీలో కొత్తగూడెం వెళ్లే మార్గంలో బస్సు కోసం ఎదురుచూసే ప్రయాణికులకు సౌకర్యాన్ని కల్పించారు. ప్రయాణికులు బస్‌సెల్టర్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రజినీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.